క్లుప్తంగా

నిరుపయోగంగా బోరుబావి



మరమ్మతులకు గురైన బోరుబావి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లల పాలెం, కృష్ణుడి ఆలయం వద్ద కాలనీవాసుల నీటి అవసరాల కోసం జీవీఎంసీ పదేళ్ల క్రితం బోరుబావి ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అది పాడవడంతో, నిరుపయోగంగా మారింది. కాలనీవాసులు నీటికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అమర్‌నాథ్‌కు అభినందనలు



అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం అమర్‌నాథ్‌ను కలిసిన శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. శ్రీధర్ మాట్లాడుతూ అమర్‌నాథ్ నాయకత్వంలో అందరం కలిసికట్టుగా పని చేస్తామన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌ను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫాకృష్ణ కలిసి అభినందనలు తెలిపారు.

రామశర్మకు బాలి స్మారక పురస్కారం



రామశర్మకు పురస్కారం అందిస్తున్న అతిథులు

సీతంపేట : విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బాలి (మేడిశెట్టి శంకరరావు) జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సభాధ్యక్షుడు శిరేల సన్యాసి రావు మాట్లాడుతూ బాలితో తనకు గల పరిచయం, అనుభవాలు, బాలి చిత్రకళా నైపుణ్యం వివరించారు. అనంతరం కొచ్చెర్లకోట సత్య నారాయణ చేతుల మీదుగా ప్రముఖ కార్టూనిస్ట్ పార్నంది వెంకట రామశర్మకు బాలి స్మారక పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. బాలి కుమార్తె మేడిశెట్టి వైశాలి రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. పురస్కార గ్రహీత రామశర్మ మాట్లాడుతూ బాలు స్మారక పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, కార్టూన్స్ గీయడంలో తనకు బాలి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఆర్.వి.రమణ మూర్తి, వెలమల సిమ్మన్న, చలపతిరావు, సరోజ, యస్.హనుమంతరావు పాల్గొన్నారు.

జాషువా రచనలు అజరామరం



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వక్తలు

ఉక్కునగరం: మహాకవి గుర్రం జాషువా రాసిన రచనలు అజరామరమని కవి, సాహితీ విశ్లేషకులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గుర్రం జాషువా 129వ జయంతి సభలో ఆయన మాట్లాడారు. నాడు కుల ఆధిపత్యం వల్ల కలిగే సామాజిక విధ్వంసాన్ని వేయి గొంతులతో ధిక్కరించి, మరణం లేని మానవత్వానికి తన సాహిత్యంతో పట్టాభిషేకం చేసిన నవయుగ కవి చక్రవర్తి జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ టి.కె.ఎస్.ఆర్. ఠాగూర్, బయ్యే మల్లయ్య, వి. ప్రకాశ్, వరకుమార్, సంపూర్ణం, కె. బాలశౌరి, వై.టి. దాస్ పాల్గొన్నారు.

ఎర్ర చెరువు కబ్జాకు స్కెచ్!

- చెరువు గట్టుపై ఇళ్లు కట్టి ఇస్తామని ఆశ చూపుతున్న టీడీపీ నేతలు
- గతంలో ఇదేవిధంగా అమ్మిన నాయకులు
- రేకుల షెడ్డు రూ.15లక్షలకు భేరం
- అడ్వాన్స్ కలెక్షన్లలో బిజీబిజీ



ఆక్రమణలకు గురవుతున్న ఎర్రచెరువు లోపలి భాగం



ఎర్ర చెరువులో జరుగుతున్న నిర్మాణాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులోని ఎర్రచెరువుపై టీడీపీ నేతల కన్ను పడింది. గతంలో ఇదే ప్రాంతంలోని ప్రభుత్వ భూమి, చెరువు గర్భం విక్రయించి సొమ్ము చేసుకున్న నేతలు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెలరేగిపోతున్నారు. రండి.. రండి భలే మంచి చౌక భేరం అంటూ ప్రచారం చేస్తున్నారు. చెరువు గట్లు అమ్మకానికి సిద్ధమవుతున్నారు. ఎవరికి వారు వారి ఆదాయాలు పెంచుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అంతా మేమే చూసుకుంటాం

స్థానిక టీడీపీ నాయకులు కబ్జా చేయడంతో పాటు ఆ స్థలంలో ఇల్లు కట్టి ఇస్తాం.. మీ వంతు రూ.15 లక్షలు ఇవ్వడమే అంటూ చెబుతున్నారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇప్పుడు ఈ వార్డులో ఇదే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. కొంతమంది అడ్వాన్స్‌లు కూడా ముట్టచెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.

పేదలే టార్గెట్

ప్రధానంగా పేదలు, మధ్య తరగతి వారిని టార్గెట్ చేసి వారిలో ఆశలు రేపి డబ్బు చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా సర్వే నంబర్‌లో 170 ఉన్న ఎర్ర చెరువు గట్లపై పలు నిర్మాణాలు జరిగాయి. పక్కా ఇళ్లు నిర్మించేశారు. ఆ అనుభవంతో ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో కబ్జాల పర్వానికి తెరలేపారు. ఇక్కడి చెరువుల స్థలాలు 30 నుంచి 40 శాతం వరకు కబ్జాకు గురయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించిన అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఈ చెరువులు కనిపించవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా చెరువులను రక్షించాలని కోరుతున్నారు. కబ్జా ప్రయత్నాలు ఆపాలని, ఇప్పటికే కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆ జ్ఞాపకాలు పదిలం



గోపాలపట్నం హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1992– 93లో పదోతరగతి చదివిన సుమారు 200 మంది విద్యార్థులు ఒక చోటకు చేరి ఆడిపాడారు. సుమారు 30 ఏళ్ల తర్వాత కలిసిన వారంతా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిలిపి చేష్టలతో ముప్పెఏళ్ల వెనక్కి వెళ్లిపోయారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర వ్యాపకాల్లో బిజీగా ఉన్నవారంతా కలవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఆప్యాయతలు వెల్లివిరిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడి సంతోషాలు పంచుకుంటూ గడిపారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు సాంబశివ మూర్తితో పాటు ఉపాధ్యాయులు అప్పారావు, లక్ష్మీనారాయణ, ఉషారాణి, వజ్రావతి, సాంబ మూర్తి, శ్రీరామ మూర్తి, నిర్మల లను ఘనంగా సత్కరించారు. వారితో ఫొటోలు దిగారు. బాగా చదువుతున్న పేద విద్యార్థులకు అండగా ఉంటామని.. వారికి ఆర్థికంగా సాయపడాలని తీర్మానించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



గౌరీనగర్‌లో ప్రమాదకరంగా స్తంభం



లైట్లు వెలగని విద్యుత్ స్తంభం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధి ఊర్వశికూడలి గౌరీనగర్‌లో సిమెంట్ విద్యుత్ స్తంభం నేల కొరిగేందుకు సిద్ధంగా ఉంది. దీంతో స్థానికులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభం పగిలి విరిగేందుకు సిద్ధంగా ఉండడంతో పాటు ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అటుగా రాకపోకలు సాగించే కంచరపాలెం, ఊర్వశికూడలి పరిధిలోని గొల్లకంచరపాలెం ట్రాక్ రహదారి, తోటవీధి, గౌరీనగర్, సుభాష్‌నగర్, దుర్గానగర్ ప్రాంతాల ప్రజలు హడలిపోతున్నారు.

వీధుల్లో అంధకారం

అదే ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, ఉన్న విద్యుత్ లైట్లు వెలగక పోవడంతో నెల రోజులుగా అంధకారం అలముకుంది. సమస్యలపై విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అట్టహాసంగా ఓనం ఉత్సవాలు



మంత్రముగ్ధుల్ని చేసిన నృత్య ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణి

అగనంపూడి: తమ ప్రాంత సాంప్రదాయాన్ని అందరితో పంచుకోవడం ఆనందంగా ఉందని కమడోర్ ఎం.లారెన్స్, ఫెర్నాండేస్‌లు అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్‌సిటీ ఆవరణలో ఆదివారం ఓనం ఉత్సవాలను వారు ప్రారంభించి మాట్లాడారు. కేరళలోని వివిధ ప్రాంతాలకు చెందిన మళయాలీలు అంతా కలిసి నిర్వహించే పండగలో పాలు పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతా కుటుంబ సభ్యులతో కలిసి ఐకమత్యంగా పండగ చేయడం శుభ పరిణామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలలకు ఆటల పోటీలు నిర్వహించారు. గాజువాక కై రళి ఆర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు పి.ఎస్.బిజూ మాట్లాడుతూ గాజువాక క్లబ్ ఆధ్వర్యంలో ఏటా ఓనం ఉత్సవాలు నిర్వహిస్తుండడం, మళయాలీలంతా ఒకేచోట చేరుకొని ఆనందాన్ని పంచుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ మళయాలీల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జి.విజయ్ కుమార్, ఆలిండియా మళయాలీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎం.పిళ్లై, ఎస్ఎస్‌టీసీ డైరెక్టర్ అబ్రహమ్ వర్గీస్, కె.కిజగుద్దీన్, గాజువాక క్లబ్ కార్యదర్శి శ్యాంజా, కోశాధికారి శరత్, ఆశీమ్, జిపిక్, ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి సాగర గిరి కనకదుర్గ

శరన్నవరాత్రి మహోత్సవాలు

- నవరాత్రుల్లో పాతపోస్టాఫీస్ ఫెర్రీ నుంచి బోటు సౌకర్యం



విశేష అలంకరణలో అమ్మవారు

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. 3వ తేదీ ఉదయం 9.15 గంటలకు కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారు రోజు కొక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 3వ తేదీన బాల దుర్గాదేవిగా, 4న గాయత్రీ దేవిగా, 5న అన్నపూర్ణ దేవిగా, 6న భువనేశ్వరి దేవిగా, 7న రాజరాజేశ్వరిదేవిగా, 8న లలితా దేవిగా, 9న సరస్వతీదేవిగా, 10న శాకంబరి దేవిగా, 11న చండీదేవిగా, 12న సాగర గిరి కనకదుర్గదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు ప్రథమపూజ, బాలభోగం నుంచి సాయంత్రం 6.30 గంటలకు పంచనేత్ర, నక్షత్ర హారతితో పూజాధికాలు ముగుస్తాయన్నారు.

బోటు సౌకర్యం..

అమ్మవారిని తొమ్మిదరోజుల పాటు దర్శించుకునే నిమిత్తం పాతపోస్టాఫీసు దరి ఫెర్రీ నుంచి యారాడ కొండ వరకు బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సౌకర్యం ఉంటుందన్నారు. విశాఖ నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పరణ



పందిరి రాట వేస్తున్న మజ్జి మాలినాయుడు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడఅప్పన్నకాలనీలో గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం గణేష్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, స్థానిక మహిళలు అమ్మవారికి పూజ చేశారు. అనంతరం వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు రాట వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉత్సవాలు జరపాలని నిర్వాహకులకు సూచించారు.

ట్రాన్స్‌పోర్టు రంగంలో ప్రాంతీయ భేదాలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న జానకిరామిరెడ్డి

గాజువాక: ట్రాన్స్‌పోర్టురంగంలో మన ప్రాంతం, వేరే ప్రాంతం అనే భేదాలు తగవని ఉత్తరాంధ్ర ట్రాలర్, ట్రక్కు ఓనర్స్ అండ్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జానకిరామిరెడ్డి అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన సంఘ సభ్యుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్న ట్రాన్స్‌పోర్టు వాహనాల పట్ల కొంతమంది స్థానిక ట్రాన్స్‌పోర్టు యూనియన్ సభ్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, తెలుగు, హిందీవారంటూ భేదాలు చూపిస్తున్నారని అన్నారు. ఇలాంటి భేదాలు చూపించడం మానుకోవాలన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు జ్యోతిరెడ్డి, సాయిరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు రంగం చాలా విశిష్టమైందని, వర్గ, కుల విభేదాలు, ప్రాంతీయ భేదాలు లేకుండా కలసికట్టుగా వ్యాపారాలు కొనసాగించాలన్నారు. అలా కాదని తమ సంఘంలోని సభ్యుల జోలికొస్తే ఊరుకొనే ప్రసక్తే లేదన్నారు. ఎవరైనా ప్రత్యక్షంగా ఎదుర్కోవాలే తప్పా దాడులకు పాల్పడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఐ.రాజా, ప్రతినిధులు పీజేఆర్ఎస్ మహారధి, మిశ్రా పైవహన్, అరవింద్ మిశ్రా, ఆర్.భాస్కరరావు, చట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

మహారాణిపేట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ జూనియర్ కాలేజ్ 1982 – 84 బ్యాచ్ విద్యార్థులు నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాలేజీ విద్య పూర్తి చేసుకుని 40 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం సామాజిక సేవలో భాగమైన పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో పట్నాల నాగరామ్మోహన్ రెడ్డి, కరణం వేణుగోపాల్, గుజ్జు ఉప్పల్ రెడ్డి, ఎర్ర అప్పారావు, శ్రీలక్ష్మి, మణి కుమారి, అప్పలరెడ్డి, జగ్గారావు, సోంబాబు, దోమడ హరి, రామకృష్ణ రాజు, సీహెచ్ అప్పారావు, చిట్టిబాబు, ధర్మ, పి.సత్యనారాయణ, గంగాధర్, బేగం, అప్పల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంకోసా నూతన కార్యవర్గం



అంకోసా నూతన కార్యవర్గం

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (ఎ.ఎం.సి.ఓ.ఎస్.ఎ) నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోశాలో నూతన కార్యవర్గం పాత కార్యవర్గం నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించింది.అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.కె.ఇ. అప్పారావు, కార్యదర్శిగా డాక్టర్ పి.వి. సుధాకర్, కోశాధికారిగా డాక్టర్ ఐ.వాణిత తదితరులు ఎన్నికయ్యారు. వీరిని వైద్యులు వి.చంద్రశేఖరం, ఎస్.వి.ఆదినారాయణ, టి.రవిరాజ్, ఇ.పెదవీర్రాజు, కె.వెంకటేశ్వర్లు, జి.టి.వి. రమేష్ తదితరులు అభినందించారు. పాత కార్యవర్గ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.శశి ప్రభ, పాత కార్యవర్గ కార్యదర్శి డాక్టర్ రామ్మూర్తి తదితరులు దగ్గర ఉండి నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ప్రయాణం.. నరకప్రాయం

- రాళ్లు తేలిన రహదారి
- మలుపుల వద్ద గోతులు
- రాకపోకలకు అవస్థలు



రాళ్లు తేలిన బీటీ రోడ్డు, మలుపు వద్ద గుంతలు

మల్కాపురం: ఆ మార్గంలో ప్రయాణం చేయాలంటే వాహనదారులలో ఒకటే గుబులు.. ఎక్కడ కంకర పిక్క ముఖానికి కొడుతుందో అని, వాహనం గుంతల్లో పడుతుందో అని. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆ మార్గంలోనే ప్రయాణాలను సాగిస్తున్నారు. 58వ వార్డు శివారు ప్రాంతమైన ములగాడ విలేజ్ నుంచి శ్రావణ్ షిప్పింగ్ మీదుగా మారుతి సర్కిల్ వైపు వెళ్లే సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరింది. శ్రావణ్ షిప్పింగ్‌కు సంబంధించిన భారీ కంటైనర్లు, టిప్పర్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ సీసీ రోడ్డు వేసి 20 ఏళ్లు అయిపోవడంతో రోడ్డు గతుకులమయంగా మారింది. సర్వీసురోడ్డులోనూ ఇదే పరిస్థితి.

ఎగసిపడుతున్న ధూళి

ఈ మార్గంలో వాహనాలు నడిపేటప్పుడు విపరీతంగా ధూళి ఎగసి పడుతుండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటీవల ఈ రోడ్డు సమస్యను కార్పొరేటర్ గులిగిందల లావణ్య కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కమిషనర్ సంపత్ కుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. అలాగే ములగాడ గ్రామపెద్దలు సమస్యను అధికారులకు వివరించారు. అయినా, నేటికీ దీనిపై స్పందన లేకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

సచ్చిదానంద శాస్త్రికి నివాళి



సచ్చిదానంద శాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళాసేవా పీఠం కార్యాలయంలో ఆదివారం హరికథా కళాకారుడు సచ్చిదానంద శాస్త్రి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళా సేవాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ హరికథను విశ్వవ్యాప్తం చేసిన ఘనత సచ్చిదానంద శాస్త్రిదే అన్నారు. హరి కథ కళా ఔన్నత్యాన్ని తన ప్రదర్శనల ద్వారా అందరికీ తెలియజేశారని కొనియాడారు. కార్యక్రమంలో కళా సేవాపీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు, కొంతం నూక రాజేశ్వరరావు, కె. వెంకట్, శ్రీనివాసరావు, భాస్కర్‌పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ



సేకరించిన సామగ్రితో నాయకులు, మండలి సభ్యులు

విశాఖ విద్య: విజయవాడ వరద బాధితుల కోసం శ్రీ శ్రీనివాస సంకీర్తన కోలాటం మండలి అధ్యక్షురాలు సీహెచ్ మంజుల ఆధ్వర్యంలో సేకరించిన నగదు, సామగ్రిని ఆదివారం విజయవాడ తరలించారు. ఈ సందర్భంగా ఎన్ఏడీలోని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్ రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సుమారు 30 గ్రామాలకు సరిపడా వస్తువులను సేకరించిన సంకీర్తన కోలాటం మండలి మహిళా సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దాడి రమేష్, జి.చంద్రశేఖర్ నాయుడు, బాల రాజేశ్వరరావు, పొలిమేర శ్రీనివాసరావు, కాళ్ల అశోక్, గొట్టివాడ వెంకటేశ్వరరావు, కోలాటం మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక అనుపు మహోత్సవం



వినాయకుడిని దర్శించుకుంటున్న నాయకులు



లడ్డూ వేలంలో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గవర వీధిలో గౌరీ సేవా సంఘం, యువకులు సంయుక్తంగా నిర్వహించిన వినాయక ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వినాయక విగ్రహం అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహానికి విశేష పూజలు చేసి అనంతరం లడ్డూ వేలం వేశారు. స్థానిక భక్తుడు రూ.42వేలకు దక్కించుకున్నాడు. వినాయకుడిని మండపంలోనే పైపులతో నీటిని పంపింగ్ చేసి అనుపు కార్యక్రమం చేపట్టారు.

- గవర వీధిలో గౌరీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బీజేపీ నాయకుడు కాశీ విశ్వనాథ్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు దాడి పురుషోత్తమ రమేష్, జీసీ నాయుడు, కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు



చిత్రాలు ప్రదర్శిస్తున్న చిన్నారులతో నిర్వాహకులు

మర్రిపాలెం : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోస్ నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు విజయవంతంగా ముగిశాయి. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ జేఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి సుంకరి రామకృష్ణారావు మాట్లాడారు. విద్యార్థులు సేవాదృక్పథం అలవరచుకోవాలని సూచించారు. స్వచ్ఛతా హీ సేవా – 2024పై విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు భవిష్యత్‌లో విద్యా సంస్థల్లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త టీఎస్ఆర్ శ్రీనివాస్, డ్రాయింగ్ టీచర్ మోహన్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోస్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.